1992 న్యూజెర్సీ తెలుగు కళా సమితి వారి కథల పోటీలో రు.200లు బహుమతి పొందిన కథ

# మథనం

**– జి. స్వర్ణలత**

## "నెమ్మదిగా దిగండి."
## "నా సంగతి సరేలే. ముందు నువ్వు జాగ్రత్త"
## "అబ్బాయి లేచేవరకు వుంటే బావుండేది."
## "... ..."

"హమ్మయ్య దిగాం. ఏం అపార్ట్‌మెంట్‌లో ఏమో!"

"ఈ క్రింద అంతస్థంతా ఖాళీగా పార్కింగ్ ప్లేస్‌కి వదిలేశారు. మన పెద్దాడి కారదుగో–తెల్ల కారు.

ఆ కారు అద్దాలు చూశావా? లోపలివాళ్ళు బైటకి కనపడరు కాని బైటవాళ్ళు వాళ్ళకి కనబడతారు."

"అలాగా! ఏమిటో చిత్రాలు!" అపురూపంగా తాకారు. అద్దాల్ని తడిమి, తన చేతుల దుమ్ము అంటుకోవడంతో నొచ్చుకుంటూ పమిటె చెంగుతో తుడిచింది జగదాంబ.

"లిఫ్ట్ వస్తుందటలే. అప్పుడింత హైరానా వుండదు. ఇక్కడ అంగుళం నేల కూడా బంగారమే అనుకో పోష్ లొకాల్టీ. ఫర్లాంగు దూరంలో బీచ్. ఇక్కడ అపార్ట్‌మెంట్ కొనుక్కుని మన పెద్దాడు మంచి పని చేశాడు" అన్నారు రాఘవరావుగారు.



"నిజం సుమండీ..."

ఇద్దరూ గేటు దాటి రోడ్డు మీదకి వచ్చారు. రోడ్డు కటూ, ఇటూ చాలా అంతస్థులున్న భవనాలు, గేట్ల దగ్గర గూర్ఖాలు.

"అబ్బ... ఎంత హాయిగా వుందో! చల్లటిగాలి! వేసం కాలంలో రోడ్డు వారగా మంచమేసుకుని, పడుకుంటే తెల్లారేవరకు మెలుకువ వుండదు."

"ఇదేం మన వూరనుకుంటున్నావా? సిటీ. అందులోనూ ఇక్కడ ఏసీల్లో పడుకుంటారు తప్పితే నడి రోడ్ల మీద మంచాలు వాల్చరు."

జగదాంబ సిగ్గు పడింది.

"ఏంటండీ ఈ రోడ్డు? కొండెక్కినట్టుంది. కాళ్ళు లాక్కుపోతున్నాయి. రిక్షాలు కనబడడం లేదు."

"ఇక్కడింతేనే. ఆటోలు, రిక్షాలు ఇక్కడెందుకుంటాయి? అందరికీ కార్లేనాయె!"

జగదాంబ రొప్పుతోంది. ఆవిడకసలే హై బీపి స్థూలకాయం. పెద్ద వయస్సు. ఇంట్లో పనే గట్టిగా గంట చేస్తే రెండు గంటలు పడకేస్తుంది. అలాంటిది ఈ నడక. ప్రాణాలు తోడేస్తున్నట్టుగా వుంది. శ్రమకి తట్టుకోలేని బలహీనమైన ఆరోగ్యం కావడంతో ఇంట్లోంచి అడుగు బైట పెట్టడానికి సాహసించదావిడ. కొడుకు గృహ ప్రవేశం కావ

డంతో తప్పనిసరై వచ్చింది. రావడం బాగానే జరిగింది. కాని వెళ్ళేటప్పుడు?

కావడానికి కన్నకొడుకే. కాని ఏదో దూరం. అదెందుకొచ్చిందో వాళ్ళకే తెలియదు. కష్టపడి, చదువు చెప్పించి ప్రయోజకుడ్ని చేశారు. పెద్ద కట్నంతో కోడలు వచ్చింది. ఆవిడకి వీళ్ళ పొకడ గిట్టదు. ఆమె ననుసరిస్తూ కొడుకు ఇక్కడికి రెండు రోజుల క్రితం వచ్చారు. ఆ ఇంట్లో వాళ్ళ స్థానమేమిటో వాళ్ళకే అర్థం కానంత హడావుడి. అనుభవం ఇచ్చిన జ్ఞానంతో ఏదో చెప్పబోతారు. సలహాలివ్వబోతారు. ఎవరూ వినరు. పెద్దరికం మాటటుంచి ఓ ఆప్యాయత, అభిమానం లేవు.

అంతా ముక్కుబడి వ్యవహారం. రిటైరైన రాఘవరావుగారికి... వస్తున్న కొద్ది పెన్షన్ మీద జీవితం వెళ్ళబుచ్చుతున్నఆయనకి ఈ ప్రయాణం ఖర్చులు కూడా భారమైనవే. ఆ మాట అటుంచి వయసు భారం. కాలూ కాలూ కొట్టుకుంటూ... అంత దూరం కష్టపడి వచ్చిన వాళ్ళని కనీసం రైల్వే స్టేషన్ వరకూనైనా దింపాలని ఇంగితం లేని కొడుకు. తెగ తిరిగి, అలిసి, సొలసి నిద్ర పోతున్న మాట నిజమే. అయితే రాత్రి భోజనాలైన తరువాత "ఇక మేము వెళ్తాంరా" అంటే "ఊఁ!" అన్నాడు.

"తెల్లారగట్లే బయల్దేరతాం" అంటే తలూపాడు తప్పితే, "నన్ను లేపండి. మిమ్మల్ని దిగబెడతాను" అన్న ముక్క అనలేదు.

జగదాంబ మనసు నొచ్చుకుంది. కాని నోరు తెరచి ఎలా అడగాలో అర్థం కాలేదు. బెత్తెడు జరీ అంచు పట్టుచీర, వంటి నిండా నగలు దిగేసుకున్న

> కొంచెం మంచి గంధం పొడిని కర్పూరం కలిపిన నీటితో ముద్దగా చేసి దానిలో కొద్దిగా నిమ్మరసం కలిపి ముఖానికి రుద్ది అది ఎండిన తర్వాత చన్నీటితో కడుక్కోవాలి. ఇలా పది రోజులు క్రమం తప్పకుండా చేస్తే మొటిమలు నశిస్తాయి. — పి.వి.

వియ్యపురాలు తాంబూలం నములుతూ అదోలా చూస్తోంది. ఆ చూపులో ఏదో ఎకసెక్కం.

భార్య పడుతున్న బాధని మరిపించడానికి అన్నారు రాఘవరావుగారు "అబ్బాయీ, కోడలూ పీటల మీద పక్కపక్కన కూర్చుంటే నా దిష్టే తగులుతుందనుకున్నాను. లక్షణంగా వున్నారు. పిల్లలు బంగారబ్బొమ్మలు."

అంత హైరానాలోను జగదాంబ మొహం నిండా ఆనందం అలుముకుంది.

"నిజం సుమండీ"

"అబ్బాయికి తొందర్లో ప్రమోషన్ వస్తుందట"

ఆవిడ మొహం నిండా ఇంకా ఇంకా ఆనందం.

రాఘవరావుగారి క్యూడా అలుపొచ్చేస్తూంది. ఆయన మొహం చిట్లిస్తుంటే, "మాత్రలు వేసుకుంటున్నారా లేదా? మాయదారి షుగరు. నేనే పూనుకుని కాస్త ఉప్మా కలియబెట్టేస్తే పోయేదేమో! మీకసలు ఉదయమే ఏదో ఒకటి తిని తీరాలాయె... అది సరేగానీండి. కోడలు చంద్రహారం, వడ్డాణం పెట్టుకుని లక్ష్మీదేవిలా వుంది కదండీ" రొప్పుతోందావిడ. అయినా ఇద్దరి మొహాల్లోనూ శారీరక బాధని మరిపిస్తూ కొడుకు భోగభోగ్యాల్ని తలుచుకోవడంవల్ల కలిగిన ఆనందం.

"హమ్మయ్య... మెరకెక్కి దిగాం. రోడ్డొచ్చింది....రిక్షాలేవీ లేవు....టాక్సీ మాట్లాడకూడదటండీ."

"బోల్డడుగుతారే. మనదంతా బొటాబొటీ వ్యవహారమాయే. ఓపిక తెచ్చుకుని నాలుగడుగులు వెయ్యి. కాస్త దూరంలో బస్‌స్టాప్ వున్నట్టు గుర్తు. సిటీ బస్ ఎక్కుదాం."

జగదాంబ బాధని పళ్ళ బిగువున అణచుకుంటోంది. మహానిస్త్రాణగా వుంది. తెల్లారుతూనే కాఫీ త్రాగే అలవాటు. ప్రాణం కొట్టుకుపోతోంది. కనుచూపు మేర టీ బడ్డీల్లాంటివేమీ కనబడడం లేదు.

నడుస్తూనే వున్నారిద్దరూ, బాధని మర్చిపోవడానికి కొడుకు వైభవం గురించి ముచ్చట్లు చెప్పుకుంటూ. ఆఖరికి ఎడారిలో ఒయాసిస్‌లా బస్ స్టాప్ వచ్చింది.

సిమెంట్ బెంచీ మీద నిస్సత్తువగా కూలబడ్డారిద్దరూ. జగదాంబ తన కన్నీళ్ళని భర్తకి కనబడనియ్యకుండా సముద్రం వైపు చూస్తున్నట్టు నటిస్తుంటే, తన చెమ్మగిల్లిన కళ్ళని భార్య కంటపడనివ్వకుండా రోడ్డు చివరకి చూస్తున్నారు రాఘవరావుగారు. వెలితిని, బాధని దాచుకునే ప్రయత్నాలు....

అమృతం కోసం మధిస్తే హాలాహలం పుట్టింది. ఇంతవరకూ తెలిసిందే. ఆ తర్వాతనే అంతకన్నా దయనీయమైనది. ఆ విషాన్ని మింగలేక మింగుతూనే, అమృతం ఆరగిస్తున్నట్టు నటించడం దయనీయమే కాదు, విషం మింగడం కన్నా విషాదకరం!

